# సూచికల బోర్డులు.. అధికారుల తప్పిదాలు

## మందమర్రిలో జాతీయ రహదారిపై తికమక సూచిక బోర్డులు

● ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల పొరపాట్లు ● వాహనదారులు, ప్రయాణికుల ఇబ్బందులు

మందమర్రి ప్రారంభంలో ఏర్పాటు చేసిన బురదగూడెం బోర్డు

మందమర్రి పట్టణం చివర యాపల్‌లో ఏర్పాటు చేసిన సూచిక బోర్డు

మందమర్రి, సెప్టెంబర్ 22 : మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్-మందమర్రి మీదుగా జాతీయ రహదారుల నిర్మాణ సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) నిర్మించిన నాలుగు వరుసల రహదారిపై ఏర్పాటు చేసిన సూచికల బోర్డులు వాహన చోదకులు, ప్రయాణీకులను అయోమయానికి గురిచేస్తున్నాయి. జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగరేణి పారిశ్రామిక ప్రాంతమైన మందమర్రి పట్టణంలో సుమారు 60 వేల మంది జనాభా ఉన్నారు. నిత్యం వేలాది మంది ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల నిర్మించిన నాలుగు వరుసల నూతన జాతీయ రహదారితో పాటు, ఫ్లైఓవర్ నిర్మాణంలో పట్టణం నూతన శోభను సంతరించుకున్నది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు రహదారి(ఫ్లైఓవర్) ప్రారంభంలో బురదగూడెం అని యాపల్ దాటిన తరువాత చివరలో మందమర్రి అని సూచికల బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో పట్టణానికి వచ్చే కొత్త వారు, వాహనచోదకులు బోర్డులు లేకపోవడంలో ఫ్లైఓవర్ ఎక్కి సోమగూడెం బెల్లంపల్లి వరకు వెళ్తున్నారు. యాపల్ ఏరియా దాటిన తరువాత ఏర్పాటు చేసిన బోర్డులను గమనించినా తిరిగి వచ్చే సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు బెల్లంపల్లి వరకు వెళ్లిన తరువాత మందమర్రి దాటిన విషయం తెలుసుకొని వెనుదిరిగి వస్తున్నారు. సంబంధిత అధికారులు జరిగిన పొరపాటును గ్రహించి, బోర్డుల ఏర్పాటులో జరిగిన తప్పిదాలను సరిదిద్దాలని, సరైన సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

# 'కల్వర్టు' నిధుల నిలిపివేత

● కేసీఆర్ ప్రభుత్వం మంజూరు.. కాంగ్రెస్ సర్కారు కాలడ్డు..! ● రూ.20 లక్షల నిలుపుదలతో పూర్తికాని కల్వర్టు నిర్మాణం

● చెన్నూర్‌లోని వడ్డెపల్లి కాలనీవాసుల ఇబ్బందులు ● వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్

చెన్నూర్, సెప్టెంబర్ 22 : చెన్నూర్ పట్టణంలోని 7వ వార్డులో గల వడ్డెపల్లి కాలనీకి వెళ్లేదారిలో కల్వర్టు.. గతంలో కురిసిన వర్షాలకు వరదలతో కొట్టుకుపోయింది. దీంతో అప్పట్లో కొట్టుకుపోయిన కల్వర్టుకు అధికారులు తాత్కాలిక మరమత్తులు చేసి, రాకపోకలకు సౌకర్యం కల్పించారు. అయితే కొట్టుకపోయిన కల్వర్టు స్థానంలో శాశ్వత కల్వర్టు నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే బాల్క సుమన్ కృషితో కేసీఆర్ ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరు చేసింది. కల్వర్టు నిర్మాణం ప్రారంభించే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ నిధులను నిలిపివేశారు. దీంతో కల్వర్టు నిర్మాణం జరుగకపోగా, ఇటీవల కురిసిన వర్షాలకు ఆ కల్వర్టు మళ్లీ కొట్టుకపోయింది. దీంతో కాలనీ ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. వెంటనే మున్సిపాలిటీ అధికారులు మరమ్మతులు చేసినప్పటికీ, కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలుపుదల చేయకపోతే ఇప్పటికే శాశ్వత కల్వర్టు నిర్మాణం జరిగి, ఇబ్బందులు తొలగిపోయేవని వడ్డెపల్లి కాలనీ ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ 20 లక్షల నిధులను వెంటనే విడుదల చేసి, కల్వర్టు నిర్మించాలని, తమ సమస్యను శాస్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

### ప్రభుత్వం హోల్డ్‌లో పెట్టింది..

- గంగాధర్, మున్సిపల్ కమిషనర్

చెన్నూర్ పట్టణంలోని వడ్డెపల్లి కాలనీకి వెళ్లే రహదారిలో కల్వర్టు నిర్మాణానికి గతంలో ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. గత ప్రభుత్వం వాటిని మంజూరుచేసింది. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ నిధులను హోల్డ్‌లో పెట్టింది. దీంతో కల్వర్టు నిర్మాణ పనులను చేపట్టలేదు.

వడ్డెపల్లి కాలనీలో వరదలకు కొట్టుకు పోయిన కల్వర్టుకు తాత్కలిక మరమత్తులు జరిపిస్తున్న మున్సిపాలిటీ అధికారులు


INFRASTRUCTURAL DEVELOPMENTAL WORKS IN WARD NO - 07 - CM Assurance

| Sl No | Nomenclature of the CC Road & Drain | No. of Culverts | Length of CC Roads in Meters | Width of CC Roads in Meters | Estimates in (lakhs) |
|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 1 | Laying of Road and Construction of CC Drain from Jagannath Judge to Bypass road via Jogulpalli Doha House to Eluru Church | 15 | 700.00 | 3.60 | 67.00 |
| 2 | Laying of Road and Construction of CC Drain from Jadi Thirupathi House to Bypass road via Devaiya Sir House to Vutlaki Sudhakar House | 8 | 320.00 | 3.60 | 24.00 |
| 3 | Laying of Road and Construction of Drain from MNCL Main road to Bypass road via Ambala ramulu House to Sage School | 10 | 440.00 | 3.60 | 66.00 |
| 4 | Odlepalli Culvert | | | | 20.00 |
| | Total | | | | 207.00 |

శాస్వత కల్వర్టు నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులు.

## వేధింపుల ప్రచారం అవాస్తవం

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 22 : శ్రీరాంపూర్ ఏరియా ఎస్సార్పీ-1 గనిలో మైనింగ్ స్టాఫ్ కార్మికులను ఏఐటీయూసీ నాయకులు వేధిస్తున్నారని జరుగుతున్న ప్రచారాన్ని వ్యతిరేకిస్తున్నామని బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైనింగ్ స్టాఫ్ ఉద్యోగులపై వేధింపులు, బెదిరింపులకు పాల్పడుతున్నారని కొన్ని యూనియన్లు చేస్తున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొమురయ్య మేనేజర్‌తో కలిసి మాట్లాడుతున్న సందర్భంలో మైనింగ్ స్టాఫ్‌తో వాగ్వాదం జరిగిందని, ఆ సమస్యలను తాము వెంటనే పరిష్కరించామని పేర్కొన్నారు.

**లాభాల వాటా చరిత్రాత్మక ఒప్పందం**

సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ లాభాల వాటా సాధించి ఒప్పందం చేసుకోవడం చరిత్రాత్మకమని జిల్లా కార్యదర్శి మేకల దాసు పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీపై ఆదివారం ఓబీ కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏఐటీయూసీ కాంట్రాక్టు కార్మికులకు అనేక హక్కులు కల్పించిందన్నారు. కేఎల్ మ హేంద్ర నాయకత్వంలో కార్మికులు 13 రోజులు సమ్మెచేసి లాభాల వాటా హక్కు సాధించుకున్నారని చెప్పారు. నాయకులు శ్రీనివాస్, నర్సింగ్, రాజేశ్, వేణు, రమేశ్, తిరుపతి పాల్గొన్నారు.

## నేడు టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నిరసన

మందమర్రి, సెప్టెంబర్ 22 : లాభాల వాటా చెల్లింపులో కార్మికులకు జరిగిన అన్యాయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు మందమర్రి ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లపై సోమవారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు ఏరియా ఉపాధ్యక్షుడు సంపత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

# 'గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల ద్రోహం'

మందమర్రి, సెప్టెంబర్ 22 : గత ఆర్థిక సంవత్సరంలో రూ.4,701 కోట్ల వాస్తవ లాభాలు వచ్చినట్లు సింగరేణి సంస్థ, ప్రభుత్వం ప్రకటించినప్పటికీ వాస్తవ లాభాలపై వాటా ఇవ్వాలని గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ప్రతిఘటించకపోవడం హెచ్ఎంఎస్ కార్మిక ద్రోహంగా భావిస్తున్నదని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఆరోపించారు. మందమర్రి పట్టణంలోని హెచ్ఎంఎస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. థర్మల్ విద్యుత్, సోలార్ ప్రాజెక్టుల స్థాపన, నూతన గనుల ప్రారంభం సింగరేణి అభివృద్ధి, విస్తరణ అని మాయమాటలు చెప్పి, వాస్తవ లాభాల నుంచి రూ.2,281 కోట్లను ప్రక్కన పెడుతుంటే అడ్డుకోకుండా తామేదో సాధించామని సంకలు గుద్దుకుంటున్న ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ కార్మికులకు ద్రోహం చేయడంగానే తాము భావిస్తున్నామని మండిపడ్డారు. వాస్తవ లాభాల్లో 33 శాతం పోను మిగిలిన 67 శాతం లాభాలతో సింగరేణి అభివృద్ధి, విస్తరణ చేయవచ్చని ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. ఎన్నడూ లేని విధంగా సగం డబ్బు పక్కన పెట్టి, మిగతా సగం నుంచి 33 శాతం లాభాల వాటా అని చెప్పడం సరికాదని, వాస్తవంగా 16 శాతం వాటా పంపిణీ అవుతుందని పేర్కొన్నారు. లాభాల వాటాను సవరించి మొత్తం రూ.4,701 కోట్ల లాభాలపై 33 శాతం వాటాను కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు జే శ్రీనివాస్, కేంద్ర ఉపాధ్యక్షుడు పార్వతి రాజిరెడ్డి, నాయకులు బోనాల శ్రీనివాస్, ఎర్ర శ్రీనివాస్ రెడ్డి, వెల్ది సుదర్శన్, ముఖేశ్, థామస్, సదానందం, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## చర్యలు తీసుకోవాలి

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 22 : పట్టణానికి చెందిన నవీన్ గౌడ్, శివ, భరత్, వంశీ(పురుషోత్తం) తనపై దాడిచేశారని, వెంటనే చర్యలు తీసుకోవాలని రీమా వినోద్‌యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలోని వైన్స్‌లో పని చేసే వంశీ(పురుషోత్తం) వ్యక్తి తన వ్యక్తిగత వీడియోలు వైరల్ చేస్తున్నాడని, అతని వద్దకు వెళ్లిన క్రమంలో నవీన్ గౌడ్, శివ, భరత్, వంశీ(పురుషోత్తం) తనపై దాడి చేశారని పేర్కొన్నారు. అసభ్య పదజాలంతో దూశించినట్లు వాపోయారు. పోలీసులు చర్యలు తీసుకోకపోవడంతోనే రోడ్డుపై బైఠాయించానని, వెనుక నుంచి గుర్తు తెలియని కారు ఢీకొనడంతో కాళ్లతో పాటు, శరీరంపై గాయాలయ్యాయని తెలిపారు. మంచిర్యాల దవాఖానలో చికిత్స పొంది, ఆదివారం ఇంటికి వచ్చినట్లు చెప్పారు. దాడి చేసిన వ్యక్తులపై ఎస్సీకి సోమవారం ఫిర్యాదు చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ విషయమై పట్టణ సీఐ శంకరయ్యను వివరణ కోరగా, ఇద్దరు యువకుల సెల్‌ఫోన్లు సీజ్ చేసి కోర్టులో హాజరుపర్చామని తెలిపారు.

# సింగరేణి లాభాలపై శ్వేత పత్రం విడుదల చేయాలి

సీసీసీ నస్పూర్, సెప్టెంబర్ 22 : సింగరేణి సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరంలో సాధించిన వాస్తవ లాభాలపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. నస్పూర్ కాలనీలోని బీఎంఎస్ కార్యాలయంలో ఆదివారం ఉపాధ్యక్షుడు నాథాడి శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లడారు. సంస్థ సాధించిన రూ.37 వేల కోట్లు అని సింగరేణి ప్రకటించిందని తెలిపారు. అందులో 33 శాతం చెల్లిస్తామని 16.9 శాతం మాత్రమే చెల్లిస్తున్నారని ఆరోపించారు. యాజమాన్యం, గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టీయూసీ కార్మికుల శ్రమను దోపిడీ చేయడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. 2022-23 సంవత్సరం రూ.32 వేల కోట్ల టర్నోవర్‌లో రూ.2,222 కోట్ల లాభాలు చూపించి, 32 శాతం రూ.711 కోట్లు పంపిణీ చేసిన యాజమాన్యం.. ఈ సంవత్సరం అంకెల గారడీతో కార్మికులను ఆర్థికంగా నష్టం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. వెంటనే రూ.4,701 కోట్లపై 33 శాతం రూ.796 కోట్లు ఇస్తున్నామని అసత్య ప్రచారం చేయడం మానుకోవాలని సూచించారు. వెంటనే కార్మికులకు రూ.4,701 కోట్లలో రూ.1551.33 కోట్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అయినా యాజమాన్యం వద్ద రూ.2,289 కోట్లు ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ కార్మిక సంఘం, గుర్తింపు కార్మిక సంఘాల వైఖరిని కార్మికులు గమనిస్తున్నారని పేర్కొన్నారు. నాయకులు రాజేందర్, పురుషోత్తంచారి, గూడ శ్రీకాంత్, మంద కమలాకర్, మేకల స్వామి, తిరుపతి, ఓదెలు పాల్గొన్నారు.

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సత్తయ్య